# తెలంగాణ లెజెండ్

THE VOICE OF THE TELANGANA

తెలుగు దినపత్రిక

(ది వాయిస్ ఆఫ్ ది తెలంగాణ)....

మహబూబ్‌నగర్ 18-08-2025 సంపుటి: 08 సంచిక: 195 పేజీలు: 1 వెల: రూ. 2/-


## బోనాల వేడుకల ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం

- ఉదిత్యాల గ్రామంలో వేడుకగా కట్ట మైసమ్మ బోనాలు
- బిఆర్ఎస్ నాయకుడు నరేందర్ ఆధ్వర్యంలో పలారం బండి ఊరేగింపు
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు
- కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి





బాలానగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి : గ్రామీణ ప్రాంతాలలో సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తారని, అందులో భాగంగా బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణం కనబరుస్తాయని మాజీ మంత్రివర్యులు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం ఈ మేరకు మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామంలో ఆదివారం కట్టమైసమ్మ బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా మహిళలు తమ బోనాలను నెత్తిపైన పెట్టుకొని భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆవుల నరేందర్ ఆధ్వర్యంలో పలారం బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఆకట్టుకుంది. పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకర్షించాయి. చిన్న పెద్ద తేడా లేకుండా బోనాల వేడుకల్లో పాల్గొని తమ సంస్కృతి సంప్రదాయాన్ని కొనసాగించారు. అంతకుముందు పలువురు పార్టీల నాయకులు గ్రామంలో జరిగిన బోనాల వేడుకలో పాల్గొని గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర పార్టీల నాయకులతోపాటు మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈదమ్మగడ్డలో వేడుకగా ఈదమ్మ తల్లి బోనాల వేడుకలు

- గ్రామ పెద్దలు చందర్, లచ్చిరాం నాయక్ తదితరుల ఆధ్వర్యంలో ప్రశాంతంగా పండగ వాతావరణం
- ఈదమ్మ తల్లికి నైవేద్యం సమర్పించిన మహిళలు





బాలానగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి : బాలనగర్ మండల పరిధిలోని ఈదమ్మ గడ్డ తండాలో ఈదమ్మ తల్లి బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదమ్మ గడ్డ తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్. లచ్చిరాం నాయక్, చందర్ నాయక్ తదితరుల ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఊరేగింపుగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు బోనాలను నెత్తిపై పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని నైవేద్యాన్ని సమర్పించారు. డీజే చప్పుడు, పోతురాజుల విన్యాసాలతో వేడుకలు విశేషంగా ఆకర్షించాయి. చిన్న పెద్ద అన్న తారతమ్యం లేకుండా ఉత్సాహంగా ఈదమ్మ గడ్డ ప్రజలు బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. బోనాల వేడుకలకు సహకరించిన గ్రామ మహిళలకు, పెద్దలకు ప్రతి ఒక్కరికి చందర్, లచ్చిరాం నాయక్ తదితరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కేవలం ఆర్ఎస్ఎస్ గొప్పలు చెప్పడం మానండి...

- మోడీ వ్యాఖ్యలు సరైనవి కావు...
- షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇబ్రహీం



దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులను విస్మరించి, కేవలం ఆర్ఎస్ఎస్ గురించి గొప్పలు చెప్పడం సరైంది కాదని, షాద్ నగర్ కాంగ్రెస్ నేత మహమ్మద్ ఇబ్రహీం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ.. 79వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. ?ఢిల్లీ ఎర్రకోటపై ప్రసంగిస్తూ ప్రధాని మోడీ ఆర్ఎస్ఎస్ గురించి గొప్పగా చెప్పడం సరికాదని మహమ్మద్ ఇబ్రహీం అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ప్రాణ త్యాగాలు చేశారని, వారిని మర్చిపోయి తన ఘనతలను చెప్పుకోవడం తగదని ఆయన పేర్కొన్నారు. ?దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులను విస్మరించడం సరైనది కాదని, ప్రధానమంత్రి చరిత్రను గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. భారతదేశంలోని కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరికాదని మహమ్మద్ ఇబ్రహీం అన్నారు.

## జర్నలిస్టుల సేవలు చిరస్మరణీయం

- బాలానగర్ ఎస్ఐ లెనిన్ గౌడ్
- బాలానగర్ మండలంలో ఉన్న 12 మంది జర్నలిస్టులకు స్వెటర్లను అందజేసిన ఎస్సై
- ఎస్సై చిరు కానుక పట్ల హ్యాపీగా ఫీలైన జర్నలిస్టులు




బాలానగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి : సమాజంలో జర్నలిస్టులు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని బాలనగర్ ఎస్సై లెనిన్ గౌడ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఈ మేరకు 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బాలానగర్ ఎస్సై లెనిన్ గౌడ్ ఆధ్వర్యంలో బాల్నగర్ పోలీస్ స్టేషన్ లో స్థానిక జర్నలిస్టులకు స్వెటర్లను అందజేసి వారి సేవలను కొనియాడారు. సమాజంలో పోలీసు శాఖ వారు, జర్నలిస్టు సోదరులు వెలకట్టలేని సేవలందిస్తున్నారని ప్రశంసించారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న జర్నలిస్టు సోదరులను ఆయన అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జర్నలిస్టులు మిత్రులందరూ తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలనగర్ మండల జర్నలిస్టులు టీవీడబ్ల్యూజే 143 మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, సీనియర్ జర్నలిస్టులు శేఖర్ రెడ్డి, మల్దే శ్రీశైలం, నవీన్ కుమార్, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న దీవెనలు వెన్నంటి ఉండాలి..

- ఆలయ అభివృద్ధికి మాజీ జడ్పీటిసి సాయి కృష్ణ సాయం..
- రూ.1,00,111 విరాళం అందజేత
- మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అభినందన..



షాద్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :

వెంకన్న దీవెనలు అందరి పైన ఉండాలని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతతో ముందుకు నడిచి ఆలయాల అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు పిలుపునిచ్చారు. ఫరూక్ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం మాజీ జెడ్పిటిసి సాయికృష్ణ రూ.1,00,111 విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని మాజీ ఎమ్మెల్యే కు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తమ సహకారాన్ని అందిస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. మాజీ జడ్పిటిసి సాయికృష్ణ మాట్లాడుతూ ఒకప్పుడు అభివృద్ధి లేక వెలవెల బోయిన ఈ ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, ఒగ్గు కిషోర్, సాయిశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాచారంలో వైభవంగా కట్ట మైసమ్మ బోనాల వేడుకలు

### బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



బాలానగర్ : బోనాల వేడుకలు మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తాయని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు బాలనగర్ మండల పరిధిలోని మాచారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శివనాయక్ ఆధ్వర్యంలో కట్ట మైసమ్మ బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జనంపల్లి అనిరుద్ రెడ్డి హాజరై అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు శివ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం లభించింది. గ్రామ మహిళలు బోనాలను నెత్తిలో పెట్టుకొని ఊరేగి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. బోనాల వేడుకల సందర్భంగా బాల్నగర్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శివ నాయక్, యూత్ అధ్యక్షులు సుప్ప మహేష్, ప్రధాన కార్యదర్శి సర్వాణి రవి కుమార్, సర్వానీ జగన్, లక్ష్మణ్, రమేష్, గ్రామ పెద్దలు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా పవన్



మహబూబ్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :

మహబూబ్ నగర్ జిల్లా బీసీ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా పవన్ నియమితులైనట్లు జాతీయ కన్వీనర్ ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే 42% ఉన్న బీసీలకు కనీసమైన గౌరవం లేదని వారు అన్నారు. బీసీల పక్షాన నిలబడి వాళ్ల కు ఏ కష్టం వచ్చిన పోరాటానికి సిద్ధంగా ఉండాలని మహబూబ్ నగర్ జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా పవను నియమిస్తున్నట్లు తెలిపారు. బిసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్ మాట్లాడుతూ.. తనపైన నమ్మకం తో ఇచ్చిన పదవిని మరింత ముందుకు తీసుకెళ్తూ బీసీల పక్షాన నిలబడడానికి ఏ కష్టం వచ్చినా బీసీల అండగా నిలబడతానని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా బీసీలో అత్యధికంగా యువకులు ముందు వరుసలో ఉండడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఇంచార్ వెంకటేష్, నాయకులు రాజేందర్, అనంతయ్య, నరేష్ గౌడ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సోదరుల అభివృద్ధికి ఎల్లప్పుడూ నా వంతు కృషి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సర్దార్ పాపన్న గౌడ్ 375 వ జయంతి పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణం లోని పాపన్న గౌడ్ చౌరస్తాలో జరిగే సోమవారం జరిగే కార్యక్రమానికి విచ్చేయాలని సర్దార్ పాపన్న గౌడ్ యువజన సంఘం సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌడ సోదరులు అభివృద్ధికి నా వంతు కృషి ఎల్లవేళలా ఉంటుందని అన్నారు.అలాగే షాద్ నగర్ లో గౌడ కమ్యూనిటీ భవనానికి సంబంధించి కూడా మరికొన్ని రోజులలో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావేశంలో ఒక మంచి నిర్ణయం తీసుకుందామని హామీ ఇచ్చారు.రేపు జరిగే ఈ కార్యక్రమానికి బహుజన సోదరులు అందరూ హాజరై విజయవంతం చేయాలని శ్రీకాంత్ గౌడ్ కోరారు.అనంతరం పాపన్న గౌడ్ యువజన సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాపన్న గౌడ్ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, భాను చందర్ గౌడ్, అభిలాష్ గౌడ్, బయికాడి రాజేందర్ గౌడ్,భాగం మధుసూదన్ గౌడ్, ప్రవీన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### ఆకట్టుకున్న పలువురు చిన్నారుల రాధాకృష్ణుల వేషాదారణ

బాలానగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం బాలనగర్ మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణ వేషాదారనలో ఆకట్టుకున్నారు. బోడజానంపేట గ్రామానికి చెందిన శ్రీహిత రాధ వేషాధనలో ఆకట్టుకోగా... శ్రీహన్ శ్రీకృష్ణుని వేషాదారనలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడి చిలిపి చేష్టలు చేయడంతో ఎంతో ముచ్చటగా అనిపించాయి.



